
హైదరాబాద్ వార్త





# ముచ్చెమటలు పట్టిస్తున్న ఎండలు

**ఈ వారంలో 40 డిగ్రీలకు చేరుకోనున్న ఉష్ణోగ్రతలు**

హైదరాబాద్, మార్చి 28 ప్రభాతవార్త : ఇటీవల కురిసిన వడగండ్ల వానను నగరవాసులు ఫుల్ ఎంజాయ్ చేశారు. తాజాగా ఎండాకాలం ప్రతాపం చూపుతోంది. చల్లటి వాతావరణం కాస్తా మండుటెండగా మారుతోంది. రాబోయే రోజుల్లో ఎండ దంచి కొడుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ వారంలోనే నగర పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. ఈ క్రమంలో ఒకటి, రెండు రోజుల్లో వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసే అవకాశం ఉంది. ఎండలు జనాలకు ముచ్చెమటలు పట్టిస్తాయని పేర్కొంది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలను పాటించాలని సూచించింది. కాగా, పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో నగరంలో జ్వరం, తలనొప్పి, వాంతులతో ఇటీవల ఆసుపత్రులకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా ఎండలో తిరిగే వారికి వడగాల్పులు కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. గాంధీ ఆసుపత్రి ఓపీకి నిత్యం ఇలాంటి లక్షణాలతో 200 మంది వస్తున్నారు. ఉస్మానియా, ఫీవర్ ఆసుపత్రుల్లో ఇదే పరిస్థితి. రానున్న రోజుల్లో వడదెబ్బ ముప్పు పొంచి ఉందని వైద్యులు చెబుతున్నారు.

# శ్రీరామనవమికి వైన్స్, బార్లు బంద్




హైదరాబాద్, మార్చి 28 ప్రభాతవార్త : శ్రీరామనవమి సందర్భంగా నగరంలో మార్చి 30న మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి. వైన్ షాపులు, కల్లు దుకాణాలు, బార్లు, రిజిస్టర్ క్లబ్‌లు, పబ్‌లతో పాటు ఫైవ్‌స్టార్ హోటల్స్‌లో బార్ రూమ్ మూసేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి 31వ తేదీ ఉదయం 6 గంటల వరకు దుకాణాలు మూసి వేయనున్నారు. శాంతి భద్రతల కారణంగా మద్యం షాపులను పండుగ సందర్భంగా మూసివేయాలని మద్యం షాపులకు ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఘనంగా పద్మావతి వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 28, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని వివేకానందనగర్‌లో కొలువైన శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి కళ్యాణం మంగళవారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. కన్నుల పండువగా జరిగిన ఈ కళ్యాణ మహోత్సవాన్ని తిలకించడం కోసం కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద శంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా టిటిడిబోర్డు అడ్వైజర్ కమిటీ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణం అనంతరం వేదపండితుల నుంచి వద్దేపల్లి స్వామి ఆశీర్వచనం తీసుకున్నారు. కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశుని ఆశీస్సులు అందరికీ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కళ్యాణోత్సవానికి ఆహ్వానించిన ఆలయ కమిటీకి ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని రాజేశ్వరరావు అన్నారు.

## బుద్వేల్‌లో గుప్త నిధుల కోసం తవ్వకాలు.. 9 మంది అరెస్ట్

మైలార్‌దేవుపల్లి, మార్చి 28 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ ప్రాంతంలో గుప్త నిధులు కోసం తవ్వకాలు జరుపుతున్న 9 మందిని రాజేంద్రగనర్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి కథనం ప్రకారం.. బుద్వేల్ ప్రాంతంలో నాగులు అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. నాగులు మనవడు వినోద్ (25) వృత్తి రీత్యా రియల్ ఎస్టేట్ వ్యాపారి. కాగా వినోద్ ఈ నెల 27వ తేదీ సోమవారం తన తల్లిని తాత ఇంటికి పంపించి వేసి బుద్వేల్‌లోని నాగుల ఇంట్లో సోమవారం మధ్యాహ్నం నుంచి గుప్తనిధులు కోసం తవ్వకాలు జరిపిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వినోద్‌తో పాటు మరో ఎనిమిది మందిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. తొమ్మిది మందిపై కేసులు నమోదు చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బ్రెయిన్‌స్ట్రోక్



**మెదడులో కల్లోలం**
**45ఏళ్లలోపు వారిలోనూ బ్రెయిన్ స్ట్రోక్**
**అవగాహన లోపం.. జీవనశైలే కారణం**
**వంశపారంపర్యంగా కూడా వచ్చే అవకాశం**
**ధూమపానం, డ్రగ్స్ అలవాట్లతోనూ ముప్పు**
**మహిళల్లో హార్మోన్ల ఇబ్బందులతో స్ట్రోక్‌కు ఛాన్స్**
**తగిన జాగ్రత్తలు అవసరం అంటున్న వైద్యులు**

హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త: శరీర అవయవాల పనితీరును నియంత్రించే మెదడు దెబ్బతినడం వల్ల కలిగే వ్యాధి బ్రెయిన్‌స్ట్రోక్. మెదడులో రక్తం సరఫరా సరిగ్గా జరగకపోవడం, రక్తనాళాలు చిట్లటం వంటి కారణాలతో బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై పక్షవాతం బారిన పడతారు. ఈ వ్యాధి ఒకప్పుడు వృద్ధాప్యంలో ఉన్న వారికే వచ్చేది. కానీ ప్రస్తుతం30 నుంచి 45ఏళ్ల లోపు యువత కూడా దీని బారినపడుతుండటం ఆందోళన కలిగిస్తుంది. జీవన విధానంలో మార్పులు, తీవ్రమైన ఒత్తిడి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాలవల్ల అనేమంది పక్షవాతానికి గురవుతున్న ట్లు వైద్యులు చెబుతున్నారు.

**30శాతం మంది యువతే..** ఒకప్పుడు 55-60 ఏళ్లవారు ఎక్కువగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యే వారు. కానీ ప్రస్తుతం బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురయ్యే వారిలో 25నుంచి 30శాతం మంది 45ఏళ్లలోపు వారే ఉంటున్నారు. హైదరాబాద్‌లోనూ రోజురోజుకు బ్రెయిన్ స్ట్రోక్ కేసులు పెరుగుతున్నాయి. నిమ్స్‌లో నెలకు 40-50మంది వరకు ఈసమస్యలతో చేరుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. వారికి వ్యాధి తీవ్రతను బట్టి జనరల్ మెడిసిన్, ఏఎంసీ న్యూరాలజీ విభాగాల్లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో వస్తున్న వారిలో రక్తంలో గడ్డలు ఏర్పడి మెదడుకు సరిగా రక్తప్రసరణ జరగకపోవడం వల్ల వచ్చే స్ట్రోక్ (ఇస్కిమిక్' 80శాతం మంది, రక్తనాళాలు చిట్లి (హెమరైజ్ )20శాతం మంది ఉంటున్నారు.

**ప్రధాన కారణాలు ఇవే..** పెద్దవయస్సు వారిలో రక్తపోటు, మధుమేహం స్ట్రోక్‌కు కారణంగా చెబుతున్నారు. 45ఏళ్ల వయస్సులోపు వారిలో హోమోసిస్టిన్, సిక్కుసెల్ అనే రక్తంలో జెనిటిక్ లోపాలు, వంశపారంపర్యం హెరాయిన్ వంటి డ్రగ్, మద్యపానం, ధూమపానం, ప్రమా దాల్లో తలకు గాయాలైన వారిలో ఎక్కువగా స్ట్రోక్ వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. వీరితో పాటు కదలిక లేని జీవన విధానం కారణంగా కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగి స్ట్రోక్‌కు గురవుతు న్నట్లు వెల్లడిస్తున్నారు. ఆడవారిలో హార్మోనల్ ఇబ్బందులు, రక్తనాళాల్లో లోపాల కారణంగా కూడా స్ట్రోక్ రావచ్చంటున్నారు. గుండెలోపాలు ఉన్న వారిలోనూ బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువని వివరిస్తున్నారు.

**ఆ నాలుగు గంటలే కీలకం..** ఇప్పుడు బ్రెయిన్ స్ట్రోక్‌కు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. లక్షణాలను గుర్తించి, నాలుగు గంటల్లోపు అస్పత్రిలో చేరుకుంటే స్ట్రోక్‌తో వైకల్యం రాకుండా వైద్యులు కాపాడగలుగుతున్నారు. ఇస్కిమిక్ స్ట్రోక్ వచ్చిన వారిలో త్రోంబలైసిస్ ఇంజెక్షన్‌ను ఇవ్వడం ద్వారా రక్తంలోని పూడికలు కరిగేలా చేస్తున్నారు. ముఖం, చేయి, కాలు ముఖ్యంగా శరీరం ఒకవైపున ఆకస్మిక తిమ్మిరి, బలహీనత ఏర్పడటం, ఆకస్మికంగా గందర గోళం ఏర్పడటం, మాట్లాడటం, అర్థం చేసుకోవడంలో ఇబ్బంది, కంటి చూపు మందగించడం, తలతిరగడం, బ్యాలెన్స్ తప్పడం, ఆకస్మికంగా తీవ్రమైన తలనొప్పి వంటికి బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలుగా వైద్యులు చెబుతున్నారు.

**జీవనవిధానం ముఖ్యం..** ప్రతి ఒక్కరూ మంచి జీవన విధాన్ని అలవాటు చేసుకోవాలి. కదలిక లేనిజీవన విధానం కారణంగా చిన్నవయస్సులోనే కొలస్ట్రాల్ స్థాయిలు పెరిగి మధ్య వయస్సు వచ్చేసరికి స్ట్రోక్‌కు దారి తీస్తున్నాయి. వంశపారంపర్యంగా స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఉన్నవారు మందులు సక్రమంగా వాడటం ద్వారా ముప్పును తప్పించుకోవచ్చు. రోజూ వ్యాయామం చేయడం, మంచి ఆహారం తీసుకోవడం ద్వారా చాలావరకు ఈవ్యాధిని నివారించవచ్చు.

# పాతబస్తీలో పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు

**100 పరీక్షా కేంద్రాలు.. హాజరుకానున్న 20 వేల మంది విద్యార్థులు**

**బహదూర్‌పుర జోన్ ఉప విద్యాశాఖాధికారి సయ్యద్ ఖాజా ముక్రం**



చార్మినార్, మార్చి 28 ప్రభాతవార్త : ఏప్రిల్ నెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరగనున్న పదివ తరగతి పరీక్షలకు పాతబస్తీలో అన్ని ఏర్పాట్లు చేశామని బండ్లగూడ, బహదూర్‌పుర జోన్‌ల ఉప విద్యాశాఖాధికారి సయ్యద్ ఖాజా ముక్రం తెలిపారు. పాతబస్తీలోని బహదూర్‌పుర జోన్ పరిధిలో 9331 మంది రెగ్యూలర్, 610 మంది ప్రైవేట్ విద్యార్థులు, బండ్లగూడ జోన్ పరిధిలో 7010 మంది విద్యార్థులు పదివ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని, పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే బాల, బాలికలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ పరీక్షా కేంద్రాలలో అన్ని వసతులు కల్పించామని ఆయన తెలియజేశారు. ప్రతీరోజు ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందని, విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన కోరారు. బండ్లగూడ జోన్ పరిధిలో 34 పరీక్షా కేంద్రాలు, బహదూర్‌పుర జోన్ పరిధిలో 50 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగింది. కాగా బండ్లగూడ జోన్‌లో 17 ప్రభుత్వ హైస్కూళ్లకు చెందిన విద్యార్థులతో పాటు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, బహదూర్‌పుర జోన్ పరిధిలో 27 ప్రభుత్వ హైస్కూళ్ల విద్యార్థులు, అదే విధంగా 138 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరు కానున్నారని ఆయన వెల్లడించారు. కాగా చార్మినార్ జోన్ పరిధిలో 3102 మంది విద్యార్థులు పదివ తరగతి పరీక్షలకు హాజరుకానున్నారని చార్మినార్ జోన్ విద్యాశాఖాధికారి ఐ.నెహ్రూ బాబు వెల్లడించారు. పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కోసం 26 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరాలు ఉంటాయని ఆయన తెలిపారు. చార్మినార్ జోన్ పరిధిలోని 16 ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులతో పాటు ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 3102 మంది విద్యార్థులు పదివ తర గతి పరీక్షలకు హాజరు కానున్నారని ఆయన తెలియజేశారు. పాతబస్తీలోని బహదూర్‌పుర, చార్మినార్, బండ్లగూడ జోన్ పరిధులలో 100 పరీక్షా కేంద్రాలలో 20053 మంది విద్యార్థులు పదివ తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు.

## శ్రీరామ నవమి ఉత్సవాలను భక్తి శ్రద్దల మధ్య జరుపుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ నవమి అధ్యక్షులు డాక్టర్ భగవంత్‌రావు, ఈచిత్రంలో గోవింద్‌రాఠి తదితరులు

గోషామహల్, మార్చి 28 ప్రభాతవార్త: శ్రీరామ నవమి ఉత్సవాలను భక్తి శ్రద్దల మధ్య జరుపుకోవాలని భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి అధ్యక్షులు డాక్టర్ భగవంత్‌రావు, ప్రధాన కార్యదర్శి గోవింద్‌రాఠిలు తెలిపారు. ఈమేరకు మంగళవారం బహెతీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉత్సవాలను 2010 నుంచి శోభయాత్రను నిర్వహించడం జరుగుతుందన్నారు. సీతారాంబాగ్‌లో శ్రీరామ కల్యాణోత్సవాన్ని నిర్వహించిన అనంతరం శోభయాత్రను మధ్యాహ్నం 1గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ శోభయాత్రకు కాశీసు మేరు పిఠాధీశ్వర్ యతి సామ్రాజ్ అనంత్ శ్రీవిభూషిత్ జగద్గురు శంకరాచార్యస్వామి, నరేంద్రనంద సర్వసతిజీ మహారాజ్, క్రాంతికారి శ్రీసంత్ భోమారామ్ జీ మహారాజ్(భా) విచ్చేయనున్నట్లు తెలిపారు. శ్రీరామ నవమి శోభయాత్రకు రాజకీయాలకు అతీతకంగా ప్రతి ఒకరు తరలిరావాలన్నారు. అంబర్‌పేట్ నుంచి, ఫీల్మ్‌నగర్, పాతబస్తీ చంద్రాయణగుట్ట, చార్మినార్, లాల్‌దర్వాజ, కార్వాన్‌లనుంచి కూడా శ్రీరామ శోభయాత్రలు రానున్నట్లు తెలిపారు. ఈశోభయాత్రలు సుల్తాన్‌బజార్ హన్‌మాన్‌టేకిడిలోని హన్‌మాన్ వ్యాయంశాల పబ్లిక్ స్కూల్‌లో భారీ బహిరంగసభ జరుగుతుందన్నారు. దారిపోడవునా శోభయాత్రకు వచ్చే భక్తులకు అన్నప్రసాదాలు అంద చేయడం జరుగుతుందన్నారు. ఈసమావేశంలో ఉత్సవ ప్రతినిధులు మాజీ కార్పొరేటర్ మెట్టు వైకుంఠం, శ్రీరామ్‌వ్యాస్, నర్సింగ్‌పూరియా, నటరాజ్ నామ్‌దారి, నారాయణ సాడా, మహేందర్‌వ్యాస్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు పేదలకు వరాలు : డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్



లబ్దిదారులకు చెక్కులను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, మార్చి 28 ప్రభాతవార్త: పేదలకు ఉపకరించే పథకాలను అమలు పరచడంలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలుస్తుందని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి పథకాలకు చెందిన లబ్దిదారులకు చెక్కులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమం సీతాఫల్‌మండిలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. 191 మంది లబ్దిదారులకు రూ. 1కోటి 85లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ పేదలకు పెళ్ళిళ్ళు ఓ శాపంగా మారకుండా ప్రభుత్వం సాయం చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతెశ్రీలత శోభన్‌రెడ్డి, కార్పొరేటర్‌లు సామలహేమ, సునిత, లింగాని ప్రసన్నలక్ష్మీ, కంది శైలజ, నేతలు కిషోర్ గౌడ్, రామేశ్వర్‌గౌడ్, సుంకు రాంచందర్, నారాయణ, కరాటేరాజు, లింగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉజ్జయినీ మహాకాళీ అమ్మవారి 2నెలల హుండీ ఆదాయం రూ. 22,74,238లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

బేగంపేట మార్చి 28, ప్రభాతవార్త : సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మవారి ఆలయంలో రెండునెలలకు సంబంధించిన హుండీ లెక్కింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ అధికారులు, ఇన్స్‌పెక్టర్ సహాయ కమీషనర్, కార్యనిర్వహణాధికారి, ఫౌండర్ ఫ్యామిలీమెంబరు, మాజీ ధర్మకర్తలు, బ్యాంకు అధికారులు, భక్తుల సమక్షంలో హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచి కూడా భక్తులు పాల్గొని అమ్మవారికి సమర్పించిన కానుకలను లెక్కించగా రెండు నెలలకు సంబంధించి రూ 22,74,238లు వచ్చినట్లు ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్‌రెడ్డి తెలియజేసారు. వీటితో పాటు వివిధ దేశాలకు చెందిన డాలర్లు కూడా వచ్చినట్లు ఆయన తెలిపారు.

## తెలుగు ఉగాది జాతీయ పురస్కారాలు-2023 ప్రదానం



ఉగాది పురస్కారాలను అందిస్తున్న పోలీసు ఉన్నతాధికారి రామదాస్‌తేజ, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ తదితరులు

చిక్కడపల్లి, మార్చి 28 ప్రభాతవార్త: తెలుగు ఉగాది జాతీయ పురస్కారాలు-2023 ప్రదానోత్సవ సభ మోహన్ ట్రస్ట్ అధినేత పిఎంకె.గాంధీ ఆధ్వర్యంలో తెలుగు ఉగాది సంబరాలు-2023 కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో తెలుగు ఉగాది జాతీయ పురస్కారాలు-2023 ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, సెంట్రల్ జోన్ అసెంబ్లీ ఏసీపీ రామ్‌దాస్ తేజ, హాస్యవధాని శంకరనారాయణ, శివరామ్‌ప్రసాద్ హాజరై డాక్టర్ తిరుమల అరవింద, పి.వి. శేషేంద్రరావు, డాక్టర్ కోహెడ ప్రసాదరావు, డాక్టర్ చంద్రశేఖర్, పోల శ్రీనివాస్, జితేందర్‌రావు, మారగోని శ్రీనివాస్, శ్యామల సూరి, డాక్టర్ ఆనందకుమారి సూరి, డాక్టర్ రాజశేఖర్‌లకు ఈ పురస్కారాలను అందించి గౌరవించారు.

## భవిష్యత్ ఉన్నత విద్య అసరాలను తీర్చేందుకు డిజిటల్ విద్యావిధానం ఒక్కటే పరిష్కారం

**సీఈసీ డైరెక్టర్ ప్రొ. జగత్‌భూషన్ నడ్డా**




జ్యోతి వెలగించి కార్యక్రమాన్ని ప్రారంబిస్తున్న ప్రొ.జగత్‌భూషన్ నడ్డా,వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీంద్ యాదవ్

తార్నాక, మార్చి 28 ప్రభాతవార్త: భవిష్యత్ ఉన్నత విద్య అసరాలను తీర్చేందుకు డిజిటల్ విద్యావిధానం ఒక్కటే పరిష్కారమని సీఈసీ డైరెక్టర్ ప్రొ. జగత్‌భూషన్ నడ్డా పేర్కొన్నారు. ఒ.యూ ఎడ్యుకేషనల్ మల్టి మీడియా రీసర్చ్ సెంటర్ ఆద్వర్యంలో మ్యాసివ్ ఆన్ లైన్ కోర్సుల దృక్పథం...ఉన్నత విద్యా బోధనలతో డిజిటల్ టెక్నాలజీ అనే అంశంపై జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఈసీ డైరెక్టర్ ప్రొ. జగత్‌భూషన్ నడ్డా మాట్లాడుతూ సంప్రదాయ బోధనా పద్దతుల నుంచి డిజిటల్ విప్లవం వైపుగా మనస్థత్వాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పాతతరం ఎదుర్కోంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డైరెక్టర్ రజనీష్ శ్రీవాస్తవ, యూజీసీ డీన్ ప్రొ.జి. మల్లేశం, ప్రొ.శ్రీనతగేష్, ప్రొ.చింతాగణేష్, ప్రొ.స్వాతి, ప్రొ.హరీష్ గుప్తా, ప్రొ.ఝాన్సీ పాల్గొన్నారు.

## ఇద్దరు స్నాచర్ల అరెస్ట్

ఉప్పల్, మార్చి 28 ప్రభాతవార్త : చైన్‌స్నాచింగ్‌లు, బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను ఉప్పల్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎసిపి పి. నరేష్‌రెడ్డి, సిఐ గోవిందరెడ్డి, డిఐ వెంకటేశ్వర్లు కేసు వివరాలు వెల్లడించారు. ఉప్పల్‌లోని మాస్టర్ ఛెఫ్ హోటల్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు పట్టుబడినట్లు తెలిపారు. వారిని ప్రశ్నించగా పలు స్నాచింగ్‌లతోపాటు, ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్లు తెలిపారు. నల్లగొండ జిల్లా ఆడిశర్లపల్లి మండలం, ఘనపురంకు చెందిన పొట్ల లోకేష్‌కుమార్ అలియాస్ లోకేష్ (27) స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ ఉప్పల్ విజయపురికాలనీలో నివాసం ఉంటున్నాడని తెలిపారు. అదే విధంగా సూర్యపేట జిల్లా కాకతీయకాలనీకి చెందిన కామిశెట్టి సాయిమౌళి అలియాస్ సాయి (26) పెయింటర్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. ఇద్దరు కలిసి వివిధ ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌లు చేయడంతోపాటు, పార్కింగ్ చేసిన వాహనాలు చోరీ చేసి ఎత్తుకెళుతున్నారని తెలిపారు. ఇదే క్రమంలో వీరికి అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా చోరీల విషయం వెల్లడైనట్లు ఎసిపి తెలిపారు.

# కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాం : మంత్రి తలసాని



మోండా డివిజన్‌లోని వెస్ట్‌మారేడ్‌పల్లిలో రూ.1.10 కోట్ల వ్యయంతో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పోరేటర్ కొంతం దీపిక, దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతుర్లు లాస్య నందిత

అడ్డగుట్ట, మార్చి 28 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజక వర్గంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని రాష్ట్ర పశుసం వర్ధక, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వివిధ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం మోండా డివిజన్ లోని రైల్ నిలయం అంబేద్కర్ నగర్, టీచర్స్ కాలనీ, ఈస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్ స్టేషన్ 31 బస్టాప్‌లలో 1.15 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, ఫుట్‌పాత్, మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం పనులను మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక నరేష్, మాజీ కార్పోరేటర్లు లాస్య నందిత, ఆకులరూపలతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గం అభివృద్ధి కోసం దివంగత సాయన్న ఎంతో కృషి చేశారని, ఆయన మరణం చాలా బాధకరమన్నారు. ఆయన మతన మధ్య లేకున్నా నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తామన్నారు. డ్రైనేజీ, రోడ్ల వంటి సమస్యలపై జల మండలి, జిహెచ్ఎంసీ ఇంజనీర్లు కో-ఆర్డినేషన్‌తో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, బిఆర్ఎస్ నేతలు ఆకుల హరిక్రిష్ణ, సంతోష్ యాదవ్, బత్తుల నారాయణ, భాస్కర్ ముదిరాజ్, జోడి బ్రదర్స్, కుమారి, నాగినేని సరిత, ఇంజనీర్లు సుదర్శన్, రమణా రెడ్డి, అంజనేయులు, రవిందర్, జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

**మంత్రి తలసాని ప్రొటోకాల్ పాటించకపోవడం సరైంది కాదు : మోండా కార్పొరేటర్ కొంతం దీపిక**

రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రొటో కాల్‌ను పాటించకపోవడం సరైంది కాదని మోండా డివిజన్ కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం దివంగత ఎమ్మెల్యే సాయన్న మరణంతో నియోజకవర్గంలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి తలసాని పాల్గొన్నారు. మంగళవారం మోండా డివిజన్‌లోని రెండు చోట్ల ప్రారంభ కార్యక్రమాలు జరుగగా రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో పనులు ప్రారంభించి సికింద్రాబాద్ 31 బస్టాప్ వద్ద జరిగే మరో కార్యక్రమానికి వెళ్తుండగా ట్రాఫిక్‌లో రెండు నిమిషాలు ఇరుక్కుపోయాను దింతో మంత్రి తలసాని అక్కడికి చేరుకొని తమను గమనించకుండా రూ.5 లక్షల అభివృద్ధి పనులను ప్రారంభిం చారన్నారు. ఎమ్మెల్యే సాయన్న ఉంటే ఇలాంటి లోపాలు ఉండేవి కావన్నారు. సాయన్న లేని చోటు నియోజకవర్గంలో కొట్టచ్చినట్లు కనిపిస్తుందన్నారు. మంత్రి తలసాని తీరు సరైంది కాదన్నారు.

# పెండింగు బిల్లులన్నీ తక్షణమే విడుదల చేయాలి

**ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా**




ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ధర్నాచౌక్, మార్చి 28, ప్రభాతవార్త: చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల బిల్లులన్నీ తక్షణమే విడుదల చేయాలని ఎమ్మెల్సీ ఏ.నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో నిర్వహించిన మహాధర్నాకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ ధనిక రాష్ట్రం అని చెప్పుకునే తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలంటూ ధర్నా చేయాల్సిన దుస్థితి రావటం ప్రభుత్వానికే సిగ్గుచేటని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక పాలన అస్తవ్యస్తంగా తయారయిందని, ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యావ్యవస్థ నడవటం లేదని ఆరోపించారు. సీఎం కేసీఆర్ 2014లో ఒక్కసారి తప్ప ఇంతవరకు ఉపాధ్యాయ సంఘాలతో మాట్లాడలేదని, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం దుర్మార్గమని ధ్వజమెత్తారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రతినెలా ఒకటవ తేదీనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూయస్పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు కే.జంగయ్య అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో ఎం.రవీందర్, ఎం.సోమయ్య, ఎస్.యాదగిరి, వై.విజయకుమార్, ఎస్.హరికృష్ణ, బి.కొండయ్య, నజీర్ మరియు వివిధ జిల్లాల నుండి వచ్చిన నాయకులు, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

## ఎల్‌బినగర్ చౌరస్తాలో శ్రీకాంతచారి కాంస్య విగ్రహం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సైదాబాద్, మార్చి 28 ప్రభాతవార్త: హైద్రాబాద్ నగర అభివృద్ధిలో తన ముద్ర ఉందని ఎంఆర్‌డిసి ఛైర్మన్, ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్‌బినగర్ చౌరస్తాలో తెలంగాణా అమరవీరుడు శ్రీకాంతచారి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నామని అన్నారు. ఎల్‌బినగర్ చౌరస్తాకు శ్రీకాంతచారి పేరు పెట్టాలని, ఫ్లైఓవర్‌కు మాల్ మైసమ్మ పేరు పెట్టాలని తాను అడిగిన వెంటనే మంత్రి కెటిఆర్ అంగీకరించడం జరిగిందన్నారు. అమరుడు శ్రీకాంతచారి ప్రాణ త్యాగాన్ని తెలంగాణా ఎన్నటికీ మరువదన్నారు. తన హయంలోనే గతంలో నగరంలో అనేక ఫ్లైఓవర్లు, పివి ఎక్స్‌ప్రెస్ వే, లుంబిని లేజర్ షో, ఔటర్ రింగు రోడ్డు తదితర నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, హుస్సేన్ సాగర్ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టడం జరిగిందని, హైద్రాబాద్ అభివృద్ధిలో తన ముద్ర ఉందన్నారు. లింగోజిగూడకు ప్రధాన సమస్యగా ఉన్న వరదనీటి సమస్య దాదాపుగా తొలగిపోయిందన్నారు.



రేణుకాఎల్లమ్మ ఆలయంలో పూజలు చేసిన శ్రీధర్‌గుప్త, తదితరులు

## భక్తులతో కిటకిటలాడిన రేణుకాఎల్లమ్మ ఆలయం

**కొడిపల్లి, మార్చి 28, ప్రభాతవార్త:** శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది.ప్రతి మంగళవారం రేణుకామాతకు పంచామృతాభిషేకం, నూతన వస్త్ర, పుష్పాలంకరణ, కుంకుమార్చన నిర్వహించి, భక్తులకు అన్నవితరణ జరుగుతుంది. మహమ్మద్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిఈఓ దుర్గయ్యగౌడ్, వినోద దంపతుల చేత పురోహితులు కొలచల సుమన్‌శర్మ వేద మంత్రాల నడుమ అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ నేత పైడి శ్రీధర్‌గుప్త, ఎస్సై శివప్రసాద్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు, గౌడ సంఘం అధ్యక్షులు చంద్రం క్రిష్ణాగౌడ్, కోఆప్షన్ మెంబర్ మహమ్మద్ ఫైముద్ హజారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాత తంగెడువెల్లి దుర్గయ్యగౌడ్ అన్న వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంతి ఫార్మాసిస్టు, డాక్టర్ పురుషోత్తం, డిసిసిబి మేనేజర్ ప్రద్యుమ్నరెడ్డి, క్యాషియర్ రవన్, శ్రీవాణ్, నరేష్, మహమ్మద్ నగర్ సొసైటి సిబ్బంది సుధాకర్, విష్ణు, కిషన్, కొడిపల్లి గౌడ సంఘం మాజీఅధ్యక్షులు పెంటాగౌడు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## కంటివెలుగు శిబిరం ప్రారంభం



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

**కొడిపల్లి, మార్చి 28, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బూరుగడ్డ పంచాయతిలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎంపిపి రాజు నాయక్ కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటిపరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు, అద్దాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తాటి ఆంజమ్మ నర్సింహులు, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సార రామాగౌడ్, ఉప సర్పంచ్ రేణుకశేఖులు, నాయకులు అమర్‌సింగ్‌రాథోడు, ప్రజలు పాల్గొన్నారు.

## కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి యాదమ్మ కిష్టయ్య

**సదాశివపేట, మార్చి 28, ప్రభాతవార్త:** మండలంలోని వెంకటాపూర్‌లో రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న కంటివెలుగు శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఎంపిపి అధ్యక్షులు యాదమ్మ కిష్టయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి, సర్పంచ్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు అంజన్న, సొసైటీ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, నాయకులు చింత సాయి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్కేపల్లిలో పోషణ్ పక్వాడ్

**సదాశివపేట, మార్చి 28, ప్రభాతవార్త:** మండలంలోని ఎన్కేపల్లిలో మంగళవారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గర్భిణీలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రసాన కార్యక్రమాలు నిర్వహించారు. చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలపై అంగన్‌వాడి టీచర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కరస్‌గుత్తిలో నర్సరీని పరిశీలించిన ఎంపిడిఓ



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపిడిఓ రాజశేఖర్

**నాగల్‌గిద్ద, మార్చి 28, ప్రభాతవార్త:** మండలంలోని కరస్‌గుత్తి గ్రామాన్ని మంగళవారం ఎంపిడిఓ కవ్‌లాస్ రాజశేఖర్ పరిశీలించారు. గ్రామంలోని నర్సరీని, వైకుంఠధామాన్ని, క్రీడా ప్రాంగణాన్ని, గ్రామంలోని వీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ రాజశేఖర్ కవ్‌లాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హరితహారంలో నాటిన ప్రతిమొక్క చెట్టుగాపెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నర్సరీలోని మొక్కల పెంపకంలో, నాటిన మొక్కలను సంరక్షించడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని బాధ్యులకు హెచ్చరించారు. ఎంపిడిఓ వెంట ఉపాధి హామి ఏపిఓ మురళికృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు సోనేష్, గ్రామ సర్పంచ్ సంజీవరెడ్డి, పంచాయితీ కార్యదర్శి సుజాత, గురుస్వామి తదితరులు ఉన్నారు.

## చాకరిమెట్ల దేవస్థానంలో ఆవుల రాజిరెడ్డి ప్రత్యేక పూజలు

**శివ్వంపేట, మార్చి 28 ప్రభాతవార్త:** టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి సోమవారం చాకరిమెట్ల శ్రీసహకార ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అంతకుముందు దేవస్థానం ఫౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం ఘనంగా స్వాగతం పలికారు. అదేవిధంగా సీతారామచంద్రస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆవుల రాజిరెడ్డి రాక సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్యకర్తలు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. నర్సాపూర్ స్థానాన్ని తప్పకుండా కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆవుల రాజిరెడ్డి జోస్యం చెప్పారు.



చాకరిమెట్లలో పూజలు నిర్వహిస్తున్న ఆవుల రాజిరెడ్డి తదితరులు

# అభివృద్ధి పనులకు రూ.76 లక్షలు మంజూరు

### ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**మెదక్ అర్బన్, మర్చి28 ప్రభాతవార్త:** మెదక్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో కమ్యూనిటీ హాళ్లు, డ్రిల్లింగ్ బోర్‌వెల్ పంపు సెట్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.76 లక్షలు మంజూరైనట్లు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే సీడీపీ నిధుల నుండి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి, బోర్‌వెల్ పంపు సెట్లకు రూ.75 లక్షల మంజూరయ్యాయని తెలిపారు. శంకరంపేట (ఆర్) మండలం సూరారం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 3 లక్షలు, సంకాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.3 లక్షలు, టి. మాందాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మానానికి రూ.3 లక్షలు, ధర్పల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.3 లక్షలు, మదూరు గ్రామంలో బీసీ కమిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు, కామారం గ్రామంలో బీసీ కమిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు, రామాయంపేటలో పట్టణంలో బోర్, మోటార్ పంపు సెట్ ఏర్పాటుకు రూ.2 లక్షలు, బీసీ కమిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు, రామాయంపేట మండలంలో లక్ష్మాపూర్ గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు, నిజాంపేట మండలంలో నిజాంపేట గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు, జనరల్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు, బోర్, మోటారు పంపు సెట్ ఏర్పాటుకు రూ.2 లక్షలు, చల్మేడ గ్రామంలో 2 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు, నందిగామ గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు, పాపన్నపేట మండలం దంజ్య తండాలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు, ధూమ్లు తండాలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరైనట్లు వివరించారు.



న్యాల్‌కల్ పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న ఎన్‌క్యూఎస్ బృందం సభ్యులు

## న్యాల్‌కల్ పిహెచ్‌సి తనిఖీ

**న్యాల్‌కల్, మార్చి 28, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం నేషనల్ క్వాలిటీ అసురెన్స్ స్టాండర్డ్ బృంధం సభ్యులు సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందుకున్న సేవలపై ఆరా తీశారు. నేషనల్ క్వాలిటీ అసురెన్స్ స్టాండర్డ్ బృంధం సభ్యులు డాక్టర్ ఆర్‌కే పాట్ని, డాక్టర్ సమీర్ పాటిల్‌లు తమ బృంధం సభ్యులతో ఆస్పత్రిని తనిఖీ చేసి ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రి డాక్టర్ శ్వేత ప్రియను పలు విషయాలను అడగితెలుసుకున్నారు.

## ఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ దంపతులకు సన్మానం

**రామచంద్రాపురం, మార్చి 28, ప్రభాతవార్త:** ఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్, బిజెపి రాష్ట్ర నాయకులు సి.అంజిరెడ్డి డాక్టరేట్ అందుకున్న సందర్భంగా మంగళవారం పట్టణంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని సాయినగర్ కాలనీ వాసులు అంజిరెడ్డి దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ ఎస్ఆర్ ట్రస్ట్ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా డాక్టర్ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు.కార్యక్రమంలో కాలనీ వాసులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అంజిరెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొడుపాకలో పోచమ్మ తల్లి వార్షికోత్సవం

**పాపన్నపేట, మార్చి 28, ప్రభాతవార్త:** మండలంలోని కొడుపాకలో పోచమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని భక్తులు భక్తి శ్రద్దలతో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, శ్రీసూక్తములతో హోమం పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు (అన్నదానం) వితరణ చేశారు. గ్రామంలో నిర్వహించిన అమ్మవారి బోనాలు ఆకట్టుకున్నాయి. వార్షికోత్సవ కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## ఎంఆర్‌ఎఫ్ ఎన్నికల్లో రాములు ఘనవిజయం



కార్మిక యూనియన్ ఎన్నికల్లో గెలుపొందిన హుగ్గెల్లి రాములును ఊరేగిస్తున్న దృశ్యం

**జహీరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:** సదాశివపేట పట్టణ శివారులోని ఎంఆర్‌ఎఫ్ టైర్ల కర్మాగారంలో మంగళవారం జరిగిన కార్మిక యూనియన్ ఎన్నికల్లో జహీరాబాద్ ప్రాంతానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు, ఎంపిటిసి సభ్యులు హుగ్గెల్లి రాములు ఘన విజయం సాధించారు. ఎన్నికల్లో తన సమీప అభ్యర్థి శేఖర్‌పై 278 ఓట్ల మెజార్టీలో ఘన విజయం సాధించారు. ఎంజి రాములు కార్మిక సంఘం అధ్యక్షులుగా ఎన్నిక కావడంతో జహీరాబాద్ పట్టణంలో సంబరాలు మొదలయ్యాయి. రాములు జహీరాబాద్‌కు చేరుకోగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై జాతీయ రహదారిపై ఘనంగా విజయ సంబరాలు జరుపుకున్నారు. రాములు విజయంపై మంత్రి హరీష్‌రావు, జహీరాబాద్ శాసన సభ్యులు కొనింటి మాణిక్‌రావు శుభాకాంక్షలు తెలిపారు.

## విజయవంతమైన ఎన్ఎస్ఎస్ శిబిరం

**గజ్వేల్, మార్చి 28 (ప్రభాతవార్త):** గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రామ్‌ఆఫీసర్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గజ్వేల్ మండలం బూర్గుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ శిబిరం 4వ రోజు విజయవంతం అయ్యింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపసర్పంచ్ మల్లికార్జున్ ఎన్ఎస్ఎస్‌శిబిరాన్ని సందర్శించి వలంటీర్లు తమ గ్రామంలో చేస్తున్నసేవలను ఉద్దేశించి మాట్లాడారు. అలాగే మధ్యాహ్నం సేషన్లో, హైద్రాబాద్ నుండి స్వస్తవ క్యాన్సర్ కేర్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ చతుర్వేది శిబిరాన్ని సందర్శించి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు ఏర్పాటుచేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్వస్తవ బృంద సభ్యులు సరిత, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.రాజశేఖర్, తెలుగు అధ్యాపకులు బి.సాయికృష్ణ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబీకులకు పరామర్శ

**చిన్నకోడూరు, మార్చి 28, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో గాయపడి అసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన మండల పరిధిలోని విఠలాపూర్ గ్రామానికి చెందిన ప్రభాకర్ కుటుంబీకులను బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటీ రాధాకృష్ణశర్మ, ఎంపిపి కూర మాణిక్యరెడ్డిలు మంగళవారం పరామర్శించి ఓదార్చారు. అధైర్యపడొద్దు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా ప్రభాకర్ కుటుంబాన్ని అదుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. మృతునికి భార్య, 9 నెలల పాప ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దికుంట నవీన్, ఎంపిటిసి సునీత సాగర్‌రెడ్డి ఉన్నారు.

## అనుమతులు లేకుండా మట్టి తరలింపు

**పాపన్నపేట, మార్చి 28, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న అక్రమార్కులపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. మండలంలోని పొడ్చెన్‌పల్లి, లక్ష్మీనగర్ గ్రామాల శివారులో అధికారుల అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న 5 ట్రాక్టర్లను మంగళవారం రెవిన్యూ అధికారులు, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కొంతకాలంగా అక్రమార్కులు మట్టిని తరలిస్తూ మూడు పూవులు ఆరు కాయలుగా సంపాదించుకుంటున్నా పట్టించుకునే వారు లేకపోవడతో వారు ఆడిందే ఆటగా కొనసాగింది. అక్రమార్కుల మట్టి తరలింపుతో పెద్ద పెద్ద గుట్టలు మాయవయ్యాయి. అధికారులు అప్పుడప్పుడు వాహనాలను స్వాధీనం చేసుకున్నా అక్రమ మట్టి తరలింపు మాత్రం ఆగడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న అక్రమార్కుల ఆటలు ఆగిపోయేలా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న దృశ్యం



తారా కళాశాలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనల దృశ్యం

## తారా కళాశాలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

**సంగారెడ్డి టౌన్, మార్చి 28, ప్రభాతవార్త:** పట్టణంలోని తారా ప్రభుత్వ కళాశాల (ఎ)లో మంగళవారం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక (జానపద నృత్యాలు, బోనాల ఊరేగింపు, బతుకమ్మ) కార్యక్రమాలను న్యాక్ బృందం ఆసక్తిగా తిలకించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెఎస్‌ఎసన రత్నప్రసాద్ తెలిపారు. కళాశాలను సోమవారం న్యాక్ బృంధం సభ్యులు సందర్శించిన విషయం పాఠకులకు విధితమే. రెండవ రోజైన మంగళవారం కళాశాలలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు బృంధం సభ్యులను ఆకట్టుకున్నాయి. కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకార్యలపై (ఎన్‌సిసి, ఎకోక్లబ్, రెడ్ రిబ్బన్ క్లబ్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, ఐసిసి, వాటర్ మార్వెస్టింగ్, జిమ్, స్పోర్ట్స్, గేమ్స్, వర్మి కంపోస్ట్ ఏర్పాటు) ఆనందం వ్యక్తం చేసినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన ఆర్ వాటర్ ప్లాంట్, గ్రీన్ లైబ్రరీ, బొటానికలన గార్డెన్, రుసా గార్డెన్‌లను బృంధం సభ్యులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ యం ప్రవీణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### కంగ్టి జడ్పీహెచ్‌ఎస్‌లో...





కంగ్టి జడ్పీహెచ్‌ఎస్‌లో వార్షికోత్సవం జరుపుకుంటున్న విద్యార్థులు

**కంగ్టి, మార్చి 28, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవాన్ని 10వ తరగతి విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చూడచక్కని డ్రస్సులో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విటల్, ఎంపిపి అధ్యక్షులు సంగీత వెంకట్ రెడ్డి, ఎంఇఓ శంకర్, పాఠశాల చైర్మన్ కోయిల కొండ కిశోర్, ఉపాధ్యాయులు కిషన్, అశోక్, గంగారాం, సంతోష్, ధర్మ నాయక్, విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన అతిథులకు పాఠశాల తరఫున ఘనంగా సన్మానించారు.

## ఉత్పత్తిదారుల సంఘంతో లాభాలు



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ భాగ్యలక్ష్మీరెడ్డి, వ్యవసాయాధికారి

**చిన్నశంకరంపేట, మార్చి 28, ప్రభాతవార్త:** ఉత్పత్తి దారుల సంఘాలు ఏర్పాటు చేసుకుంటే రైతులు లాభాలను పొందవచ్చని మండల వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవీణ్, ఎంపీపీ భాగ్యలక్ష్మీరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రజాపరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఉత్పత్తి దారుల సంఘం ఏర్పాటుకు 300 మంది రైతుల సభ్యత్వం తప్పని సరి అని, 10 మంది డైరెక్టర్లు ఉంటే సరిపోతుందన్నారు. రైతులు ఉత్పత్తి దారుల సంఘం ఏర్పాటు చేసుకుంటే నాబార్డు ద్వారా ఈక్విటి గ్రాంట్ అందుతుందని, దానిద్వారా తక్కువ ధరకే వ్యవసాయ పనిముట్లు, పురుగు మందులు, విత్తనాలు, పరిశ్రమ నుండి నేరుగా రైతులకు చేరుతాయన్నారు. వరినాటు, కోత యంత్రాలు రాయితీపై వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో గంగాధర్ ఎఫ్‌పివో రీజినల్ కో-ఆర్డినేటర్ గంగాధర్, భారాస పార్టీ మండల అధ్యక్షుడు రాజు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఎంపీవో గిరిధర్‌రెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## కంటి వెలుగుతో మెరుగైన వైద్యం : డీఎల్పివో రాజేంద్రప్రసాద్

**చిన్నశంకరంపేట, మార్చి 28, ప్రభాతవార్త:** కంటి సమస్యలతో నేడు ఎన్నో బాధలు పడుతున్న వారికి కంటి వెలుగు ద్వారా మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని డిఎల్పివో రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామంలో కంటి వెలుగు శిభిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలతో బాదపడుతున్న వారికి దృష్టి లోపాలు నివారించేందుకు కంటి వెలుగు శిభిరాలను ప్రభుత్వం నిర్వహిస్తుందని దినిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. కంటి వెలుగు శిభిరాల వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కంటి పరిక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు,అవసరమైన వారికి శస్త్ర చికిత్సలను ఉచితంగా చేస్తారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కుంట నాగలక్ష్మీ, మండల వైద్యాధికారి సాయి సింధూ, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, ఉప సర్పంచి ఉపెందర్‌రెడ్డి, నాయకులు తీగుళ్ల స్వామి, మన్నె బాలస్వామి, కుంట రాజశేఖర్ తదితరులు పాల్గోన్నారు.



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించిన డీఎల్పీవో రాజేంద్రప్రసాద్



చిరుతపులి ఆనవాళ్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న డీఎఫ్‌వో

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : డీఎఫ్‌వో రవిప్రసాద్

**పెద్దశంకరంపేట, మార్చి 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కె. వెంకటాపూర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్న విషయాన్ని తెలుసుకొని మెదక్ జిల్లా అటవీ శాఖ అధికారి రవిప్రసాద్ మంగళవారం కె..వెంకటాపూర్ అటవీప్రాంతాన్ని పరిశీలించారు. లేగ దూడ చనిపోయిన స్థలానికి చేరుకొని చిరుత పులి ఆనవాళ్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. లేగ దూడ చనిపోయిన రైతుకు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కె. వెంకటాపూర్ గ్రామస్థులు సాయంత్రం దాదాపు పది రోజుల వరకు అటవీ ప్రాంతంలో తిరగవద్దని సూచించారు. అటవీ ప్రాంతంలో ప్రజలు ఎవరూ తిరగవద్దని, అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అనంతరం పెద్దశంకరంపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, చీలపల్లి ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసి పదవ తరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఫారెస్ట్ రేంజ్ అధికారి వికాస్, సిబ్బంది నర్సింలు, ప్రవీణ్, స్రవంతి, ప్రధానోపాధ్యాయులు సుజాత, వెంకటేశం, విఠల్ నాయక్, ఎంఆర్‌సీ సిబ్బంది సంగమేశ్వర్ తదితరులు ఉన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌ల పంపిణీ

**పెద్దశంకరంపేట, మార్చి 28 ప్రభాతవార్త:** పదవ తరగతి విద్యార్థులకు విగ్రం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ విగ్రం శ్రీనివాస్‌గౌడ్ ఆదేశానుసారం మంగళవారం విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను, పెన్నులను పంపిణీ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో, తెలంగాణ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మహంకాళి, కృష్ణమూర్తి, సిద్ధు, మణికంఠ, లోకేష్, సుదీర్, పవన్, వెంకట్, కృష్ణాగౌడ్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాదాయ శాఖ నుంచి ఎటువంటి ఉత్తర్వులు అందలేదు

**శివ్వంపేట, మార్చి 28 ప్రభాతవార్త:** శివ్వంపేట మండలం చాకరిమెట్లలో వెలసిన శ్రీ సహకారం అంజనేయ స్వామి దేవస్థానంలో తదుపరి ప్రధాన అర్చకులుగా నియమిస్తున్నట్లు దేవదాయ శాఖ నుండి ఇప్పటి వరకు తమకు ఎటువంటి అధికారికంగా ఉత్తర్వులు అందలేదని దేవస్థానం కార్య నిర్వహణాధికారి సారా శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తర్వులు అందగానే అందరి సమక్షంలో అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు. దేవస్థానంలో ప్రధాన అర్చకులుగా నియమిస్తున్నట్లు వస్తున్న కథనం ఇప్పటి వరకు తన దృష్టికి రాలేదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆధీనంలోని దేవాదాయ శాఖ నిబంధనలను తాము తప్పకుండా పాటిస్తామని సారా శ్రీనివాస్ తెలిపారు.

## రాయికోడ్‌లో పోషణ పక్వాడ్

**రాయికోడ్, మార్చి 28, ప్రభాతవార్త:** మండలంలోని ఔరంగానగర్, చెర్లరాయిపల్లి గ్రామాల్లో మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని బాలింతలకు, గర్భిణీలకు అంగన్‌వాడి టీచర్లు సునిత, సమాదానాలు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఐకెపి మండల సమైఖ్య లీడర్ సంగీత మాట్లాడుతూ చిరుధాన్యాల ఆహారంతో ఆరోగ్యం తమ అదుపులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగార్జున, నర్సమ్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అఖిల్, భవిత, అంగన్‌వాడి ఆయ మల్లమ్మ, గర్భిణీ స్త్రీలు, బాలింతలు పాల్గొన్నారు.

## మావినెల్లిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు

**నాగల్‌గిద్ద, మార్చి 28, ప్రభాతవార్త:** మండలంలోని మావినెల్లి, రేఖ్యా నాయక్ తండాల్లో సిడిఎస్ నిధులతో పాటు ఈజిఎస్ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాలకు మంజూరైన నిధులతో సిసిరోడ్డు పనులు, మురుగుకాల్వల నిర్మాణం లాంటి అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని గ్రామ సర్పంచ్ విఠల్‌రావు పాటిల్ ఆనందం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్దే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వఇం పనులు చేపడుతోందని సర్పంచ్ వివరించారు.



మావినెల్లి గ్రామంలో సిసి రోడ్డు పనులు కొనసాగుతున్న దృశ్యం



పాఠశాలలో తాళాలను పగులగొట్టిన దుండగులు

## పాఠశాల తాళాలను పగులగొట్టిన దుండగులు

### -పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యా కమిటీ చైర్మన్ నాగరాజు

**కొల్చారం, మార్చి 28 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని దుండగులు తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ విషయమై పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నాగరాజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో రోజు మాదిరిగా పాఠశాలకు వెళ్లిన క్రమంలో తాళం పగులగొట్టి డోర్లు ఓపెన్ చేసి ఉన్నాయన్నారు.ఇటీవల మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు సరఫరా చేసిన విలువైన సామాగ్రి ఉన్నట్లు తెలిపారు. అంతేకాకుండా పాఠశాలలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కొల్చారం పోలీసులను కోరడం జరిగిందన్నారు.

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని యువకుడి మృతి

**సంగారెడ్డి టౌన్, మార్చి 28, ప్రభాతవార్త:** గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తిని మృతి చెందిన సంఘటన సంగారెడ్డి పట్టణ శివారులో జాతీయ రహదారిపై పెప్సీ ఫైఓవర్ వద్ద చోటు చేసుకుంది. సంగారెడ్డి రూరల్ సిఐ కథనం ప్రకారం...మంగళవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రుడిని సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స అందుకుంటూ గుర్తు తెలియని వ్యక్తి తిరిగిరాని లోకాలకు చేరిపోయాడన్నారు. గుర్తు తెలియని వ్యక్తి వయసు 25 నుంచి 30 సంవత్సరాల వరకు ఉంటుందని, ఎరుపు రంగు బనీయన్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. శవానికి పోస్టుమార్టం నిర్వహించి ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చినట్లు సిఐ వివరించారు. గుర్తు తెలియని వ్యక్తిని గుర్తిస్తే రూరల్ సిఐ 8702656719, సంగారెడ్డి రూరల్ ఎస్ఐ 8712656746, పోలీసు ఠాణా 8919785080 లను సమాచారం అందించాలని సిఐ సూచించారు.

## విద్యార్థి అదృశ్యం

**కంది, మార్చి 28, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల నుంచి ఓ విద్యార్థి అదృశ్యమైన సంఘటన ఇది. ప్రిన్సిపాల్ కథనం ప్రకారం... పాఠశాలలో 10వ తరగతిలో విద్యను అందుకుంటున్న కోహీర్ మండలం కవేలి గ్రామానికి చెందిన మహ్మద్ సావూద్ ఇబ్రహిం (15) ఈ నెల 27న సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో వసతి గృహం నుంచి తప్పిపోయాడన్నారు. విషయం బాలుడి తల్లిదండ్రులతో విచారిస్తే తమ వద్దకు రాలేదన్నారన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఉషాశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.